క్లుప్తంగా

నేడు రెడ్డినగర్ తిరునాళ్ల

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి 21వ తిరునాళ్ల మహోత్సవం ఈనెల 4వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం విద్యుత్ ప్రభ, కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

యలమందలో ఎన్‌ఎస్‌ఎస్ సేవాశిబిరం



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్–2 విభాగం ఆధ్వర్యంలో యలమంద గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా శిబిరాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవా శిబిరం జరగనున్న ఏడు రోజుల పాటు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణం, మహిళా శిశు సంక్షేమంపై గ్రామస్తులను చైతన్యపరచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ.సరళాదేవి, అధ్యాపకులు డాక్టర్ పీఎన్‌వీడీ మహేష్, డాక్టర్ పి.శ్రీనివాససాయి, డాక్టర్ విజయకుమారి, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన పోషకాహారం పక్వాడా కార్యక్రమం



ఈపూరు: మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో పోషకాహారం పక్షోత్సవాలు సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో ఉషకిరణ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిన్నారుల పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత నియంత్రణకు ఆకుకూరలు, క్యారెట్ బీట్‌రూట్ తదితర పోషకాలు కల్గినవన్నీ సక్రమంగా అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం చిరుధ్యాన్యాల పోషకాహార వంటలు తయారీ చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొపెల దేవరాజ్, జెడ్పీటీసీ చౌడయ్య, బుచ్చయ్య, వైద్యాధికారి నాగేంద్ర బాబు, సూపర్‌వైజర్లు చిన్నమ్మాయి, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. మార్కెట్ సెంటర్ సమీపంలో అనుమానస్పందంగా తిరుగుతున్న షేక్ మస్తాన్‌వలి, సుభానిలను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

అనుమతిలేని క్వారీలపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా క్వారీల్లో పేలుడు పదార్థాలను వినియోగించి ఇరువురు కార్మికుల మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా జీవో నెం. 551 ఉత్తర్వులను తుంగలో తొక్కి లారీ యజమానుల వద్ద కొందరు కాంట్రాక్టర్లు ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐసీసీటీయూ నాయకులు ఎస్కే ఫిరోజ్, దుర్గాప్రసాద్, కార్మిక నాయకులు లింగాచారి, వెంకటేష్, వెంకట్రావు, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మాదల(ముప్పాళ్ళ): ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని మాదల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన శావాసుజాత(24) అనే వివాహిత మహిళ గత నెల 21వ తేదీన ఇంట్లో ఎలుకలమందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుంటూరు జీజీహెచ్‌లో మెరుగైన చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. జరిగిన ఘటనపై భర్త సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభి రామయ్య తెలిపారు.



నాదెండ్లలో 144 సెక్షన్‌లో ఎస్సై భాస్కర్, సిబ్బంది, మహిళా పోలీసులు



వినుకొండలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



రొంపిచర్లలో పాఠశాల ఆవరణలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

టెన్త్ పరీక్షలు ఆరంభం

వాగ్దేవీ.. విజయాలనివ్వవూ..



రొంపిచర్ల పరీక్ష కేంద్రంలో సరస్వతీ దేవి విగ్రహానికి నమస్కరిస్తున్న విద్యార్థినులు

నాదెండ్ల: మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 241 మంది విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరు కాగా, నాదెండ్లలో 116 మందికి గాను నూరు శాతం హాజరయ్యారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 192 మందికి గాను ఒక్కరు గైర్హాజరయ్యారు. తొలిరోజు కావటంతో విద్యార్థులు తల్లిదండ్రులతో 8.30 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 9 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించగా, 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభంకాగా, 12.45 గంటలకు పరీక్షలు ముగిశాయి. దూరప్రాంత విద్యార్థులకు హాల్‌టిక్కెట్‌తో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. చిరుమామిళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీడీఈవో వేణుగోపాల్ తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా బొడ్డుపల్లి శ్రీనివాసరావు, విజయభారతి, జానకీరామ్ వ్యవహరించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో, ఆటోలలో, కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను కార్లలో, ద్విచక్రవాహనాలపై పరీక్షా కేంద్రాలకు వచ్చారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రంలో ఒక్కో విద్యార్థి చొప్పున ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సిటింగ్ స్క్వాడ్ సభ్యులైన మాచర్ల ఎంఈవో నాగయ్య, తహసీల్దార్ జి.అంకారావు, ఎస్‌ఐ సురేష్‌లు తనిఖీనిర్వహించారు.

యడ్లపాడులో ఐదుగురు గైర్హాజరు

యడ్లపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు తొలిరోజున తెలుగు పరీక్షను రాశారు. మండలం పరిధిలోని మొత్తం 9 ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్స్, ఒక ఎయిడెడ్, మరో 4 ప్రైవేటు హైస్కూల్స్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో 622 మంది విద్యార్థులు పదో తరగతి అభ్యసించారు. గతంలో మండలంలోని సొలస జెడ్పీ విద్యార్థులు నాదెండ్ల, ఫిరంగిపురం మండలాల్లోని సంకురాత్రిపాడు, ఫిరంగిపురం గ్రామాల్లోకి పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేవారు. అలాగే సందెపూడి జెడ్పీ విద్యార్థులు చిలకలూరిపేట కేంద్రాలకు హాజరయ్యే వారు. ప్రస్తుతం ఆయా సమస్యల్ని పరిష్కరిస్తూ మండల కేంద్రంలోని నారాయణ ఇంగ్లీష్ స్కూల్, సెయింట్ ఆన్స్, లూథరన్ హైస్కూల్ నందు మూడు పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేశారు. ఎరీక్షలు రాసే విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు 13 రూట్లలో 13 బస్సులను ఉచితంగా ఏర్పాటు చేసినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజరు ఎస్.రాంబాబు తెలిపారు.

పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు..

సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మండలంలో 590 మంది హాల్ టిక్కెట్లు తీసుకోగా వారిలో 585 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. నారాయణ పరీక్ష కేంద్రంలో 259 మందికి ముగ్గురు, లూథరన్ పరీక్షా కేంద్రంలో 116 మందికి ఒకరు, సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రంలో ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలం కేంద్రం శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా 271 మంది విద్యార్థులకు గాను 267 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 12 గదుల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9.30 నిమిషాలకు నుంచి 12.45 వరకు పరీక్షలు జరిగినట్లు చీఫ్ సూపరిండింట్స్ అడపా రాజశేఖర్, డిపార్టుమెంటల్ అధికారి యం.రామారావు తెలిపారు. స్థానిక ఎస్సై గల్లా రవి కృష్ణ సారథ్యంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, పోలీసు బందోబస్తు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పరంగా ఉచితంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే తరగతి గదులు సీరియల్ నెంబర్లు హాల్ టిక్కెట్లు నంబర్లు పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డు ద్వారా తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల్లో చేరుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచనలు చేయటంతో పాటు పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సందర్శించి మౌలిక వసతులు ఏర్పాట్లుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సజావుగా ప్రారంభమైన 10 పరీక్ష

వినుకొండ టౌన్: పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో మెదటి రోజు సోమవారం నిర్వహించిన తెలుగు భాష పరీక్షకు 2043మంది విద్యార్థిని విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నిర్మలా బాలికో న్నత పాఠశాల, లయోలా ఉన్నత పాఠశాల, ప్రభు త్వ ఉన్నత పాఠశాల, వివేకానంద ఉన్నత పాఠశాల, గీతాంజలి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల, నిర్మలా ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల, గుడ్‌షప్పర్డ్ ఉన్నత పాఠశాల, గీతమ్స్ ఉన్నత పాఠశాల (న్యూ క్యాంపస్), కారంపుడి రోడ్‌లోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, ఆగాబావి బజారు నందు గల నారాయణ పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వినుకొండ పరిధిలో 143 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో 11 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తుండగా తొలి రోజు 2,067 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 24 మంది హాజరు కాలేదన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. చిలకలూరిపేట పట్టణ, మండల పరిధిలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పసుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్–2, బీఆర్‌ఐ ఎంపీఎల్‌హెచ్‌ఎస్, వేద, చైతన్య, ఆర్‌వీఎస్‌సీవీఎస్, జెడ్పీహెచ్‌ఎస్, సెయింట్ చార్లెస్, సాయి వికాస్, బాష్యం,ఎస్‌పీటీఆర్‌కేఎం పాఠశాలలో 2,303 విద్యార్థులకు గాను, 2,290 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలోని మేళ్లవాగు, గుమ్మనంపాడు, వెల్లటూరు, బొల్లాపల్లిలోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంకు చెందిన సప్లిమెంటరీ, రెగ్యులర్ విద్యార్థులు సుమారు 490 మంది విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. వీరిలో సప్లమెంటరీ, రెగ్యులర్ రెండు సెంటర్ల కలిపి 408 మంది విద్యార్థులకు గాను 390మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.



యడ్లపాడులో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు



శావల్యాపురం పరీక్ష కేంద్రంలో సీరియల్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం

కార్యకర్తలకు నాయకుల దిశ నిర్దేశం

నాదెండ్ల: చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో ఈ నెల 6వ తేదిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కౌన్సిలర్ విడదల గోపీతో పాటూ మరికొంతమంది పలు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. గణపవరంలో మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసానికి చేరుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి ఆర్టీసీ బస్సులు సభకు ఏర్పాటు చేశామని, ఉదయం 8 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం వివిధ వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తతంగా వివరించి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చూడాలన్నారు. గడిచిన నాలుగేళ్లలో చిలకలూరిపేట మండలంలో తొలిసారిగా ముఖ్యమంత్రి పర్యటించనున్నందున నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ కాట్రు రమేష్, మాజీ ఉపసర్పంచ్ గాలి బుచ్చయ్య, జెడ్పీ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, మాజీ ఎంపీటీసీలు, వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, తహసీల్దార్ రమణ

నాదెండ్ల: ఈ నెల 6న జరిగే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభ విజయవంతానికి అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెలుగు, వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి 60 పైగా ఆర్టీసీ బస్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉదయం 7.30 గంటలకు బస్సుల వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి 8.30 గంటలకు చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్లకు చేరుకోవాలన్నారు. 10 గంటలకు జరిగే సీఎం సభకు ప్రతి ఒక్కరూ హాజరై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. హాజరయ్యే ప్రతి ఒక్కరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మస్తాన్ రావు, తహసీల్దార్ ఏవీ రమణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం

నకరికల్లు: పాలుపోసుకుంటున్న వరికి అకాలవర్షాల ప్రభావంతో బ్యాక్టీరియల్ ఆకుఎండుతెగులు ఆశించే ప్రమాదముందని నివారణకు యాజమాన్య పద్ధతులే కీలకమని ఏరువాకకేంద్రం ప్రధాన సమన్వయకర్త, శాస్త్రవేత్త సీహెచ్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని వరి పొలాలను సోమవారం పరిశీలించారు. డీడీఏ ఎం.శివకుమారి. ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, ఎంపీఈఓలు కె.రవిబాబు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం ఏర్పాటు



వీహెచ్‌పీ పల్నాడుజిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ నాగరాజేశ్వరి అధ్యక్షతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షునిగా ఏ.వి.ఆర్.కె.సత్యనారాయణ, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా జెబీవీఎస్ఎస్ ప్రసాదు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా వెలుగూరి దుర్గావాసవి, సాంస్కృతిక విభాగ అధ్యక్షులుగా కె.ఎం.ఎల్.ప్రసాదు, కనమర్లపూడి శారద, భజరంగదళ్ అధ్యక్షునిగా జక్కా రవిశంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, సాయి సత్సంగ్ సేవాట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి దేవస్థానంలో జన్మనక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

చిలకలూరిపేట: అయ్యప్పస్వామి జన్మనక్షత్రం ఫంగణీ ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఓగేరువాగుకు దక్షిణాన చినపసుమర్రులో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్ తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి నిత్యార్చన, గణపతి హోమం, అష్టోత్తర కలశాభిషేకం, నమకం, అష్టాభిషేకం తదుపరి స్వామివారి అలంకార దర్శనం, మహా హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మహానివేదన, స్వామి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు సంధ్యా దీపారాధన, అర్చన, రాత్రి 8.30 గంటలకు పవళింపు సేవ ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రూ.5 కోట్లతో కోటప్పకొండలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సత్కరిస్తున్న కొండకావూరు వైఎస్సార్ సీపీ నాయకులు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలోని కొండకావూరులో వేంచేసియున్న శ్రీ వేమలమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్ల వార్షికోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ త్రికోటేశ్వరుని ఆశీస్సులతో కోటప్పకొండ సమీప గ్రామాలైన కొండకావూరు, పమిడిమర్రు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. కోటప్పకొండకు వచ్చే రహదారులను అభివృద్ధి చేయడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పడిందన్నారు. కోటప్పకొండ ప్రధాన అలయం నుంచి పాత కోటయ్య స్వామి ఆలయానికి మెట్ల మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే శివ కుటుంభం, స్వాగతద్వారాల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. కోరిన కోర్కెలు తీర్చే దేవతగా వేమలమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాంపాటి వెంకటప్పారెడ్డి, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, కోటప్పకొండ ఆలయ కమిటీ మాజీ సభ్యులు ముక్కు వెంకటేశ్వర రెడ్డి, మాట్లా లింగారెడ్డి, కనకా పుల్లారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌ను వరించిన ఉగాది మహానంది పురస్కారం



పురస్కారంతో చిత్రకారుడు

వినుకొండ టౌన్: చిత్రకళలో తనదైన సేవలు అందించిన పట్టణానికి చెందిన చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాదరావును ఉగాది మహానంది పురస్కారం వరించడం పట్ల సోమవారం కుటుంబ సభ్యులతోపాటు పట్టణానికి చెందిన పలువురు ప్రశంసలు అందచేశారు. ఈ సందర్భంగా చిత్రకారుడు ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ బసవపున్నయ్య కళాకేంద్రం బాలోత్సవ భవన్లో, వేయి గొంతుకుల వేదిక వారు నిర్వహించిన ఉగాది మహానంది పురస్కార మహాసభకు ముఖ్య అతిథులుగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఏపీఐడీజీ చైర్మన్ బండి పుణ్యశీల హాజరుకాగా వారి చేతుల మీదుగా బహుమతి ప్రదానం, ప్రశంసా పత్రాన్ని అందచేయడం జరిగిందని తెలియచేశారు. కార్యక్రమంలో సీఈఓ అశోక్ కుమార్, డైరెక్టర్ హనుమంతప్ల నాగరాజు, కో ఆర్డినేటర్ పద్మావతిలు పాల్గొన్నారన్నారు.

సాగు భూములివ్వాలంటూ వినతి



తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి ఇస్తున్న ఎస్టీ నాయకులు

యడ్లపాడు: నిరుపేద ఎస్టీలకు జీవనోపాధికి ప్రభుత్వ భూముల్ని పంపిణీ చేయాలని కోరతూ సోమవారం తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావుకు వినతి అందించారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ ఆధ్వర్యంలో బోయపాలెం ఎస్టీసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ యడ్లపాడు మండలం పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్ని రీసర్వే ప్రక్రియలో గుర్తించి వాటిని నిరుపేదలైన ఎస్టీ వర్గాలకు కనీసం 2 ఎకరాల చొప్పున కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వి సూర్యనాయక్, ఆర్ శివానాయక్, వి హనుమంతరావునాయక్ పాల్గొన్నారు.

యడ్లపాడులో భగవద్గీతపై ప్రచారం



కారుచోలలో కరపత్రాలు అందజేస్తున్న సభ్యులు

యడ్లపాడు: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్లకు చెందిన ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. సోమవారం కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కటికం సైదారావు, కె.అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపి, డి శ్రీను పాల్గొన్నారు.

డ్రైవర్ అరెస్ట్

ముప్పాళ్ళ: మండలంలోని మాదల సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద జరిగిన ఆటో బోల్తా ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై ఎమ్. పట్టాభిరామయ్య సోమ వారం తెలిపారు. చాగంటివారిపాలెంకు చెందిన కొరబండి శాంతకుమారి మృతి చెందగా మరో మహిళకు, డ్రైవర్ గాయాలయ్యాయి.